

విద్యుత్ హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వాయుగుండం ప్రభావం నేపథ్యంలో విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు ఇపిడిసిఎల్ ఎస్ఇ ఎన్.కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. **శ్రీకాకుళం డివిజన్ : 9490610045, టెక్కలి డివిజన్ : 8332843546, పలాస డివిజన్ 7382585630, పాలకొండ డివిజన్ : 8332843546** ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలను తాకడం, వేలాడుతున్న విద్యుత్ వైర్లను పట్టుకోవడం, వాటి కింద నుంచి నడవడం, చెట్ల కొమ్మలపై పడిన చెట్లను తాకకూడదని తెలిపారు. విద్యుత్‌కు సంబంధించిన సమస్యలపై హెల్ప్ డెస్క్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. మరిన్ని వివరాలకు **శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయం హెల్ప్ డెస్క్ 9490612633, టోల్ ఫ్రీ నంబరు 1912**ను సంప్రదించాలని సూచించారు.



ముసురేసింది

- వాయుగుండం ప్రభావంతో వానలు
- నేడూ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు
- అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్
- అధికారులు, ఉద్యోగులకు సెలవులు రద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా శుక్రవారం వర్షాలు కురిశాయి. జిల్లాలో సగటున 7.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కవిటి మండలం రాజపురంలో అత్యధికంగా 20.75 మి.మీ వర్షం కురిసింది. హిరమండలం గొట్టాబ్యారేజీ ప్రాంతంలో 19.75 మి.మీ వర్షం పడింది. వాయుగుండం ప్రభావంతో మరో రెండు రోజులు వర్షాలు పడనున్నాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను అప్రమత్తం చేశారు. తుపాను ముందస్తు చర్యలపై అన్ని శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

బంగాళాఖాతంలో తొలుత ఏర్పడిన రుతుపవన ద్రోణి శుక్రవారం నాటికి వాయుగుండంగా మారింది. దీని ప్రభావంతో జిల్లాలో వర్షాలు పడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో మబ్బులతో ఆకాశం మేఘావృతమై తేలికపాటి జల్లులు కురిశాయి. జిల్లాలో కవిటి, హిరమండలం తదితర ప్రాంతాల్లో మోస్తర్త వర్షాలు పడగా, మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. ఇచ్ఛాపురం మండలం అరకభద్రలో 17.5 మి.మీ, పలాస మండలం తాళభద్రలో 11 మి.మీ వర్షపాతం నమోదైంది. శ్రీకాకుళంలో 7.75 మి.మీ, ఎచ్చెర్లలో 6.75 మి.మీ, రణస్థలం మండలం పైడిభీమవరంలో 6.5 మి.మీ, ఆమదాలవలసలో 5.5 మి.మీ వర్షం కురిసింది.

అప్రమత్తమైన అధికార యంత్రాంగం

అల్పపీడనం క్రమేణా వాయుగుండంగా మారడంతో జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయన్న వాతావరణశాఖ అధికారులతో హెచ్చరికలతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అధికారులు, ఉద్యోగుల సెలవులను రద్దు చేశారు. తుపాను పునరావాస కేంద్రాలను పరిశీలించారు. వర్షాలకు చెట్లు కూలినా అప్పటికప్పుడు తొలగించే విధంగా ఏర్పాట్లు చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా సిబ్బందిని అందుబాటులో ఉంచారు. చెరువులు, కాలువలకు గండ్లు పడితే వెంటనే పూడ్చడానికి వీలుగా ఇరిగేషన్ అధికారులు సిబ్బందిని అందుబాటులో ఉంచారు. బోట్లు, గజ ఈతగాళ్లను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

నేడు పాఠశాలలకు సెలవు

వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో శనివారం అన్ని యాజమాన్యాల పాఠశాలకు కలెక్టర్ ఆదేశాల మేరకు సెలవు ప్రకటించినట్లు డిఇఒ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సెలవును ఇంకో సెలవు రోజున పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లాలో తుపాను ప్రభావిత ప్రాంతాల ముందస్తు చర్యలు, పారిశుధ్యం తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాను కేంద్రాలను అధికారులు సంయుక్తంగా సందర్శించాలని ఆదేశించారు. కాలువలు, బ్యారేజీలను రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులు ఉమ్మడిగా తనిఖీ చేయాలన్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా కాచి చల్లార్చిన నీరు తాగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షికి సూచించారు. నదీ పరివాహక గట్లు, కాలువలు, చెరువులు ఎక్కడైనా పాడైతే తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.వంశధారలో నీటి ప్రవాహం, గొట్టాబ్యారేజీ వద్ద నీటి నిల్వల పరిస్థితిని వంశధార అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంశధార ఎస్ఇ రాంబాబు మాట్లాడుతూ వంశధారలోకి వచ్చే నీరు తక్కువగా ఉందని, ప్రస్తుతం ఇన్‌ఫ్లో 1900 క్యూసెక్కులు ఉందని బదులిచ్చారు. చెరువు గట్లు సరిగ్గా ఉన్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాచి చల్లార్చిన తాగాలంటూ గ్రామాల్లో చాటింపు వేయించామని చెప్పారు. వంతెనలు ఏవైనా శిథిలావస్థలో ఉన్నాయా, రహదారుల పరిస్థితిపై జెసి నవీన్ అడిగి తెలుసుకున్నారు. డిఎంహెచ్ఒ మీనాక్షి మాట్లాడుతూ భారీ వర్షాలకు సచివాలయం స్థాయి నుంచి గర్భిణుల జాబితా సిద్ధంగా ఉంచామని, వైద్యాధికారులను అప్రమత్తం చేసినట్లు వివరించారు. కొండ ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో గర్భిణులను జాగ్రత్తగా చూడాలని జెసి చెప్పారు. అలాంటి ప్రాంతాల్లో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని తెలిపారు.

ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బోట్లు ఎన్ని అందుబాటులో ఉన్నాయి, వాటి పరిస్థితిని చూస్తామని చెప్పారు. ఫోన్లు పనిచేయకపోతే మేన్ ప్యాక్‌లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వ్యవసాయశాఖ జెడి శ్రీధర్ మాట్లాడుతూ నారుమళ్లు ముంపునకు గురై కుళ్లిపోతే విత్తనాలు సిద్ధంగా ఉంచినట్లు వివరించారు. గజ ఈతగాళ్లు సిద్ధంగా ఉంచుకోవాలని మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావును ఆదేశించారు. నిత్యావసర సరుకులు తీసుకున్న చర్యలపై డిఎస్ఒ బి.శాంతిశ్రీ వివరించారు. ఐసిడిఎస్ భవనాలు శిథిలావస్థలో ఉన్న కేంద్రాలను వేరే ప్రాంతాలకు తక్షణమే మార్చేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే పాఠశాల భవనాల్లో పునరావాస కేంద్రాల ఏర్పాటుకు సిద్ధంగా ఉంచాలని డిఇఒ వెంకటేశ్వరరావును ఆదేశించారు. తుపాను రక్షిత భవనాలు జిల్లాలో 32 ఉండగా, తొమ్మిది మాత్రమే వినియోగానికి ఉపయోగకరంగా ఉన్నట్లు డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్ వివరించారు. సమావేశంలో డిఆర్ఒ ఎం.గణపతిరావు, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, సిపిఒ లక్ష్మీప్రసన్న, కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఆర్‌అండ్‌బి ఎస్ఇ జాన్ బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

సొంత జిల్లాకు తహశీల్దార్లు

- ఎన్నికల విధులకు వెళ్లిన 33 మంది వెనక్కి
- సిసిఎల్ఎ మెమో జారీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధుల కోసం ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహశీల్దార్లను తిరిగి సొంత జిల్లాకు కేటాయిస్తూ సిసిఎల్ఎ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం 33మంది తహశీల్దార్లను విశాఖ, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం తదితర జిల్లాలకు వారిని కేటాయించారు. ఎన్నికలు ముగిసినా వారిని సొంత జిల్లాకు పంపకపోవడంతో రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు గత నెల ఏడో తేదీన సిసిఎల్ఎ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం సిసిఎల్ఎ ద్వారా శుక్రవారం మోమో జారీ చేసింది.

దీనిపై ప్రభుత్వం మూడు, నాలుగు రోజుల్లో ఉత్తర్వులు జారీ చేయనుందని తెలిసింది. ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన తర్వాత వారు ఆయా జిల్లాల నుంచి రిలీవ్ కానున్నారు. జిల్లా అధికారులకు రిలీవ్ రిపోర్టును సమర్పించిన తర్వాత వారికి మండలాలను కేటాయించనున్నారు. సొంత జిల్లాకు వచ్చిన తహశీల్దార్లకు సొంత రెవెన్యూ డివిజన్‌లో మాత్రం పోస్టింగ్ ఇవ్వవద్దంటూ సిసిఎల్ఎ తన మెమోలో స్పష్టం చేసింది.



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

అంతర్రాష్ట్ర నదీ జలాల సమస్య పరిష్కారానికి కృషి

- పాలన మారింది... పనితీరు మార్చుకోవాలి
- అభివృద్ధిని పరుగులు పెట్టించాలి
- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

అంతర్రాష్ట్ర నదీ జలాల సమస్య పరిష్కారానికి కృషి చేసి, సాగునీటి వనరుల అభివృద్ధికి కృషి చేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సూచించారు. ఒడిశాలో బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున సమస్య పరిష్కారానికి అవకాశాలున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులతో ఎమ్మెల్యే బెందాళం అశోక్ అధ్యక్షతన శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన మారిందని, అందుకనుగుణంగా అధికారులు పనితీరు మార్చుకోవాలన్నారు. మున్సిపాల్టీలో అభివృద్ధిని పరుగులు పెట్టించాలని పిలుపునిచ్చారు. పనిచేసే అధికారులకు ప్రోత్సాహం ఉంటుందని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు కూడా తప్పవని హెచ్చరించారు. వంశధార, బాహుదా నదుల అనుసంధానం చేయాలని టిడిపి ప్రభుత్వ హయాంలో జిఒ జారీ చేస్తే, వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. మళ్లీ దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ నదుల అనుసంధానం జరిగితే సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉండవని చెప్పారు. ప్రతి ఇంటికీ తాగునీరందించే జల్ జీవన్ మిషన్ పథకం కింద రూ.600 కోట్లతో ఉద్దానం రక్షిత మంచినీటి పథకాన్ని అప్పటి సిఎం జగన్ ప్రారంభించినా, వైసిపి ప్రభుత్వం కనీసం సగం గ్రామాలకూ తాగునీరు అందించలేకపోయిందని విమర్శించారు. ప్రతి ఇంటికీ తాగునీరందించే అవకాశాలను పరిశీలించి నివేదిక తయారు చేసి అందించాలని ఆదేశించారు. ఉద్దానం నీటి సరఫరాలో 25 ఏళ్లుగా పనిచేస్తున్న సిబ్బందిని అకారణంగా తొలగించడంపై ఎమ్మెల్యే అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో జీతాలు అందకపోయినా పనిచేస్తున్న సిబ్బందిని రాజకీయ కారణాలతో తొలగించడం మంచి పద్ధతి కాదన్నారు. ఎవరినీ తొలగించలేదని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ జాన్ బెన్హర్ తెలిపారు. సమగ్ర నీటి పథకం మంజూరైనా బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని పబ్లిక్ హెల్త్ అధికారి సుగుణాకర్ తెలిపారు. ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు తయారు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. నిధుల్లేమితో నియోజకవర్గంలో గత ఐదేళ్లలో ఇరిగేషన్ పనులు చేపట్టలేకపోయామని ఇరిగేషన్ ఎస్ఇ పి.సుధాకరరావు తెలిపారు. మున్సిపాల్టీలో తాగునీటి పథకాలతో పాటు సురంగిరాజా క్రీడా మైదానం అభివృద్ధి చేయాలని, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు కృషి చేయాలని కేంద్రమంత్రికి మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రమేష్ ఆధ్వర్యాన సిబ్బంది కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేను సత్కరించారు. సమావేశంలో పలాస ఆర్‌డిఒ భరత్ నాయక్, పంచాయతీరాజ్ ఎస్ఇ ఎం.వి శేఖర్, ఇఇ సూర్యప్రకాష్, డిఇ రామకృష్ణ, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం

కేంద్ర మంత్రిగా బాధ్యతల స్వీకరణ అనంతరం తొలిసారిగా ఇచ్ఛాపురం వచ్చిన రామ్మోహన్ నాయుడుకు టిడిపి, కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయాన్ని కేంద్రమంత్రి దర్శించారు. టిడిపి నాయకులు కె.ధర్మారావు కుటుంబసభ్యులు కేంద్రమంత్రికి సన్మానం చేశారు.

జిల్లా అభివృద్ధికి డబుల్ ఇంజిన్

కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

రాష్ట్ర, జిల్లా అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నామని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గతంలో రాష్ట్ర మంత్రిగా ఒక ఇంజిన్ మాత్రమే పనిచేసిందని, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా డబుల్ ఇంజిన్ పనిచేస్తోందని చెప్పారు. టెక్కలిలో శుక్రవారం నిర్వహించిన పౌర సన్మాన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మూలపేట పోర్టు, విశాఖ-మూలపేట ఆరు వరుసల రోడ్డు, మూలపేట ఎయిర్‌పోర్టు నిర్మాణంతో జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి అడుగులు పడతాయని చెప్పారు. మూలపేట ఎయిర్‌పోర్టు రాకతో జిల్లా ముఖచిత్రమే మారుతుందని తెలిపారు. జిల్లా అభివృద్ధికి అహర్నిశలూ కృషి చేస్తామన్నారు. టెక్కలి పట్టణాన్ని జిల్లా కేంద్రం తలదన్నేలా మారుస్తానని చెప్పారు. ప్రజలు, పార్టీ కార్యకర్తల ప్రేమాభిమానాలు వెలకట్టలేనివన్నారు. సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కింజరాపు హరివరప్రసాద్, ఎల్.ఎల్ నాయుడు, బగాది శేషగిరిరావు, పినకాన అజయ్ కుమార్, బోయిన రమేష్, బిజెపి జిల్లా అధ్యక్షులు బి.ఉమామహేశ్వరరావు, పూడి తిరుపతిరావు, జనసేన నాయకులు కణితి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

జిజిహెచ్‌కి ఎమ్మెల్యే ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం : ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మౌలిక సదుపాయల కల్పనకు ఎమ్మెల్యే గొండు శంకర్ శ్రీకారం చుట్టారు. ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం 25 ఫ్యాన్లను అందజేసేందుకు ముందుకొచ్చారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, మౌలిక సదుపాయల కల్పనకు దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే శంకర్ తనవంతు బాధ్యతగా ఫ్యాన్లను వితరణగా అందజేస్తున్నట్లు ప్రకటించారు. తన సొంత నిధుల నుంచి 25 ఫ్యాన్లను ఆస్పత్రికి అందజేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా కాంట్రాక్టర్ లక్ష్మణరావు 25 ఫ్యాన్లు, రామారావు 50 ట్యూబ్‌లైట్లను ఆస్పత్రికి అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే శంకర్ తెలిపారు.

లారీని ఢీకొట్టిన బస్సు

- బస్సు డ్రైవర్, లారీ క్లీనర్‌కు తీవ్ర గాయాలు
- ఏడుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు



ప్రజాశక్తి - లావేరు

ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొన్న ఘటన మండలంలోని అదపాక కూడలి సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్, లారీ క్లీనర్‌కు తీవ్ర గాయాలు కాగా, మరో ఏడుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అదపాక కూడలిలో హైవే ఫ్లైఓవర్‌పై పంక్చర్ కావడంతో లారీ రోడ్డుపై ఆగిపోయింది. లారీకి పంక్చర్ అయిన టైర్‌ను తీసి, వేరే టైరు అమరుస్తున్న సమయంలో విశాఖపట్నం డిపోకు చెందిన విశాఖ నుంచి శ్రీకాకుళం వస్తున్న ఆర్‌టిసి నాన్‌స్టాప్ బస్సు లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ఆర్‌టిసి బస్సు డ్రైవర్ శ్రీనివాసరావు కేబిన్‌లో ఇరుక్కుపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వేగంగా వచ్చిన బస్సు లారీని ఢీకొట్టడంతో లారీ టైరు అమరుస్తున్న క్లీనర్ గౌతమ్ పైకి లారీ వెళ్లడంతో రెండు కాళ్లు, చేతులు విరిగిపోయి ఘటనాస్థలిలోనే స్పృహ కోల్పోయాడు. బస్సులో ప్రయాణిస్తున్న విశాఖపట్నం జిల్లా తాటిచెట్లపాలెంకు చెందిన ప్రయాణికురాలు జె.రోహిణి కాలు ఫ్రాక్చర్ అయింది. ప్రమాదం సంభవించిన సమావేశంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉండగా, ఏడుగురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాద విషయం తెలుసుకున్న లావేరు, ఎచ్చెర్ల ఎస్ఐలు స్వామినాయుడు, చిరంజీవి, హైవే పోలీసులు, స్థానికులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కేబిన్‌లో ఇరుక్కుపోయిన బస్సు డ్రైవర్‌ను బయటకు తీశారు. క్షతగాత్రులను 108 వాహనాల్లో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్వామినాయుడు తెలిపారు.



కేబిన్‌లో ఇరుక్కున్న బస్సు డ్రైవర్

సహాయకచర్యల్లో ఎమ్మెల్యే ఎన్ఇఆర్

ప్రమాద ఘటనను తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రతినిధులు నటుకుల మోహన్, బాడాన దేవభూషణరావు, రోటరీ క్లబ్ ప్రతినిధి శంకరరావు క్షతగాత్రులను అంబులెన్స్‌ల్లో ఆస్పత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలుసుకుని మానవతా దృక్పథంతో ముందుకొచ్చి సహాయక చర్యలు చేపట్టిన భీమునిపాలెం యువకులను ఎమ్మెల్యే ఎన్ఇఆర్ అభినందించారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. నగరంలోని దిశ, రెండో పట్టణ పోలీస్‌స్టేషన్లను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ల ఆవరణ, గదులను పరిశీలించి, స్టేషన్ల నిర్వహణ రికార్డులు, ముఖ్యమైన సిడి ఫైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో నమోదైన మహిళలపై జరిగిన దాడుల కేసుల దర్యాప్తు తీరును పరిశీలించారు. స్టేషన్ సిబ్బంది వివరాలు, విధి నిర్వహణపై ఆరా తీశారు. రాత్రి వేళలో గస్తీ విధులు పటిష్టంగా నిర్వర్తించి నేరాల నియంత్రణ, విజిబుల్ పోలీసింగ్ చేపట్టాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో దిశ పోలీస్‌స్టేషన్ డిఎస్‌పి శ్రీనివాసరావు, రెండో పట్టణ సిఐ ఉమామహేశ్వరరావు, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న మహేశ్వర్ రెడ్డి


మద్దతు ధరల గ్యారంటీకి చట్టం చేయాలి

ప్రజాశక్తి - రణస్థలం

కేంద్ర ప్రభుత్వం అన్ని పంటలకు మద్దతు ధరల గ్యారంటీకి చట్టం చేసి రైతాంగ ఆత్మహత్యలు నివారించాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకి రణస్థలంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2020-21 రైతు ఉద్యమం సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాతపూర్వక హామీలు ఇచ్చిందని, వాటి అమలుకు ఇంతవరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం చేసి అమలు చేయాలని... రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణ విముక్తి కలిగించాలని విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని, విద్యుత్ ప్రైవేటీకరణ చట్టం రద్దు చేయాలని కోరారు. సమగ్ర బీమా పథకం అన్ని పంటలకు, పశు పోషణ సంబంధిత ప్రభుత్వరంగం పరిధిలోనే వర్తింపజేయాలన్నారు. రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూలమైన ప్రధానమంత్రి పంటల బీమా యోజన పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులందరికీ ప్రతినెలా రూ.10 వేలు పింఛను ఇవ్వాలని కోరారు. రైతు అనుకూలమైన భూసేకరణ చట్టం-2013ను అమలు చేయాలన్నారు. ఏటా పెరిగే భూమి ధరలకు అనుగుణంగా ప్రాజెక్టులు, ప్రభుత్వ, ప్రైవేటు అవసరాలకు, భూసమీకరణకు భూమి కోల్పోయిన వారికి పునరావాసం కల్పించి, న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, వాణిజ్య రంగాల్లో కార్పొరేట్ రంగాలకు అవకాశం కల్పించరాదని డిమాండ్ చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి జిడిపి వాటాతో ప్రత్యేక కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని చెప్పారు. చారిత్రకమైన రైతాంగ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన రైతులకు, లఖింపూర్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబాలకు న్యాయమైన నష్టపరిహారం అందించాలని, రైతులపై పెట్టిన కేసులన్నీ కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పెట్టుబడి సాయం జమ చేయాలి

వజ్రపుకొత్తూరు : రైతులకు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం ఇస్తామన్న రూ.20 వేలు రైతులు, కౌలు రైతుల ఖాతాల్లో తక్షణమే జమ చేయాలని ఎపి రైతుసంఘం నాయకులు టి.భాస్కరరావు డిమాండ్ చేశారు. నగరంపల్లి సచివాలయం వద్ద రైతుసంఘం, కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ధర్నా అనంతరం సచివాలయ కార్యదర్శి ప్రియాంకకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఎన్.బైరాగి, ఎన్.చంద్రయ్య, ఎన్.మోహనరావు, బి.ఆనందరావు, బి.సుగుణావతి తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం : ఎంపీ కలిశెట్టికి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘాల నాయకులు

టెక్కలి రూరల్ : మండలంలోని అయోధ్యపురం సచివాలయం వద్ద ధర్నా అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు బి.వాసుదేవరావు, బి.సంజీవ్, భీమారావు తదితరులు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని మాకన్నపల్లి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ సిహెచ్.సోను, కాశీబుగ్గ గాంధీనగర్ సచివాలయ అడ్మిన్ లావణ్య కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి తదితరులు పాల్గొన్నారు.

కంచిలి : మండలంలోని బూరగాం సచివాలయంలో అధికారులకు రైతుసంఘం నాయకులు కె.గోపీనాథ్, జనార్ధన, మన్మథరావు తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు.

సోంపేట : మండలంలోని మామిడిపల్లి సచివాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కర్రి సింహాచలం, పి.కృష్ణమూర్తి, టి.రామారావు, ఎస్.పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : మండలంలోని ఎస్.ఎం పురం, కేశవరావుపేట, ఫరీదుపేట గ్రామ సచివాలయాల్లో రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు పొందూరు చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి- నరసన్నపేట

జలుమూరు కోన పెంటమ్మ-రామ్మూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు నోట్ పుస్తకాలను శుక్రవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ కళాశాలల్లో చదివే ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వాలని సిఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కళాశాలలో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్ర నాయుడు, శిమ్మ చంద్రశేఖర్, పోలాకి మండల పార్టీ అధ్యక్షుడు మిరియాపల్లి వెంకటప్పల నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భైరి భాస్కరరావు, మునుకోటి దాంబాబు, బగ్గు గోవిందరావు పాల్గొన్నారు.


ఎస్పితో సచివాలయ మహిళా పోలీసులు

ఎస్పిని కలిసిన సచివాలయ పోలీసులు

ప్రజాశక్తి- రణస్థలం

జిల్లా ఎస్పి మహేశ్వర్ రెడ్డిని సచివాలయ మహిళా పోలీసులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో వారికి ఎదురవుతున్న సమస్యలు, నిర్వర్తిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. కష్టపడి పనిచేసిన వారికి డిపార్ట్మెంట్‌లో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని, అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. రణస్థలం మండలం కోష్ట సచివాలయం మహిళా పోలీస్ బమ్మిడి అమ్మోజీ, కె.భారతి, యమున, త్రివేణి, రత్నకుమారి ఉన్నారు.


ప్రసంశాపత్రాలు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ నవీన్

సామాజిక సేవతో ఆత్మసంతృప్తి

కవిటి: మనిషికి ఆత్మ సంతృప్తికి మించిన తృప్తి లేదని అది సామాజిక సేవతో పరి పూర్ణమవుతుందని జాయింట్ కలెక్టర్ నవీన్ అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్దానం ఫోటోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గతేడాది రక్తదాన శిబిరం నిర్వహించారు. దీంతో సమాజంపై ఫోటో గ్రాఫర్స్ వహించిన బాధ్యతను గుర్తించిన రెడ్ క్రాస్ సంస్థ ఉద్దానం ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్‌ను అభినందించి గురువారం రాత్రి ఆత్మీయ సత్కారం చేసింది. జాయింట్ కలెక్టర్ నవీన్ చేతులుమీదుగా ప్రశంశా పత్రాలు అందజేసింది. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించింది. కార్యక్రమంలో ఉద్దానం ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యదర్శి దుగాన శ్యామ్, సహాయ కార్యదర్శి గౌరీ శంకర్, పర్రి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎపిడి రాధ

బాధ్యతగా సామాజిక తనిఖీ పూర్తి

సరుబుజ్జిలి: మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా జరిగిన నిధుల చెల్లింపుపై నిర్వహించే సామాజిక తనిఖీని అధికారులు బాధ్యతగా నిర్వహించాలని డ్వామ ఎపిడి పంచాది రాధ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి సామాజిక తనిఖీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. 2023 - 24లో మండలంలో రూ.14.93 కోట్లు ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా చెల్లింపులు నిర్వహించినట్లు ఎపిఒ పార్వతి తెలిపారు. ఈ సందర్భంగా ఎపిడి మాట్లాడుతూ 2007లో ప్రారంభమైన ఉపాధి పనుల్లో భాగంగా ప్రస్తుతం 17వ విడత సామాజిక తనిఖీ చేపట్టడం జరుగు తుందన్నారు. తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటించి నప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్దలను సమన్వయ పరచుకొని సమగ్ర నివేదికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎఇ చింతాడ మణికుమార్, విజిలెన్స్ ఎపిఒ అరుణ్ కుమార్, ఎంపిటిసిలు సూర్యనారాయణ, సింహాచలం, సర్పంచ్ కృష్ణ పాల్గొన్నారు.


యుబి కార్మికులను పనిలోకి తీసుకోవాలి

రణస్థలం: యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమలో అక్రమంగా నిలుపుదల చేసిన కార్మికులను వెంటనే పనిలోనికి తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు, యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జె.గంగరాజు డిమాండ్ చేసారు. మండలంలోని కంబలపేటలో యునైటెడ్ బ్రేవరీస్ యాజమాన్యం పరిశ్రమలో అక్రమంగా నిలుపుదల చేసిన కార్మికులను పనిలోకి తీసుకునేలా తగుచర్యలు తీసుకోవాలని కోరుతూ యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడుకు శుక్రవారం రణస్థలంలో తన క్యాంపు కార్యాలయం వద్ద వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 18 ఏళ్ల నుంచి కార్మికులగా క్రమశిక్షణతో పనిచేస్తున్న జె.గంగరాజు, పి.సత్యన్నారాయణ, జి.శంకర్, ఎండ తవుడు, కె.గొల్లబాబులను ఈ నెల 15 నుంచి యాజమాన్యం ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా అక్రమంగా నిలుపుదల చేసిందన్నారు. యాజమాన్యం అన్ ఫెయిర్ లేబర్ ప్రాక్టీస్‌కు పాల్పడుతుందన్నారు. కార్మికులకు ఇదే వారి జీవనాధారమని, వారిపైనే కుటుంబం సభ్యులు ఆధారపడి వున్నారన్నారు. పరిశ్రమలలో అక్రమంగా నిలుపుదల చేసిన కార్మికులను యాజమాన్యం పనిలోకి తీసుకునేలా, పని నిలుపుదల చేసినప్పట్నుంచి వేతనం చెల్లించేలా కృషి చేయాలని కోరారు.

చేనేతకారులకు అండగా నిలవాలి

శ్రీకాకుళం : ఖాదీ వస్త్రాలను ఆదరించి చేనేతకారులకు అండగా నిలవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. ఇలిసిపురంలోని గ్రామ స్వరాజ్య సంఘం ఖాదీధామ్ ఆవరణలో ఆధునీకరించిన ఖాదీ గ్రామోద్యోగ్ భాండార్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఖాదీ ఉత్పత్తులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆధునిక వస్త్ర ప్రపంచంతో పోటీ పడుతూ ఖాదీ పరిశ్రమ మనుగడ సాగిస్తోందన్నారు. యువత ఖాదీని ఆదరించాలని తద్వారా చేనేతలకు అండగా నిలవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ డైరెక్టర్ ఎస్.గ్రీవ్, అసిస్టెంట్ డైరెక్టర్ షేక్ మహమ్మద్ నాస్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ధరలు... వంటమ్మలపై భారాలు

పాఠశాలలో వంటలు చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు


- పెరగని మెనూ ఛార్జీలు
- ఆందోళనలో వంట ఏజెన్సీలు

ఒకవైపు నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మరోవైపు ప్రభుత్వం ఇస్తున్న మెనూ ఛార్జీలు చాలక పోవడంతో వంట ఏజెన్సీల మహిళలు ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

ప్రజాశక్తి- బూర్జ

పప్పులు, వంట నూనె, కూరగాయలు, గ్యాస్ ఇలా ఒక్కటేమిటి అన్ని రకాల నిత్యవసర వస్తువుల ధరలు పెరగడంతో పాఠశాల పిల్లలకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న వంటలమ్మలు అష్ట కష్టాలతో నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న మెనూ చార్జీలు ఏమాత్రం సరిపోవటం లేదని వంట ఏజెన్సీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ధరల పెరుగుదలతో ప్రభుత్వం మెనూ అందించాలంటే చేతి నుంచి ఖర్చు చేయాల్సి వస్తుందంటున్నారు. నాణ్యమైన భోజనం అందించాలంటే ప్రభుత్వం బిల్లులు సకాలంలో చెల్లించడంతో పాటు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను దృష్టిలో పెట్టుకొని మెనూ చార్జీలను పెంచాలని మధ్యాహ్నం భోజన కార్మిక సంఘం ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించి బియ్యం మాత్రమే సరఫరా చేస్తుంది. కూరగాయలు, పప్పు దినుసులు, వంట గ్యాస్, వంట సామాగ్రి నిర్వాహకులు కొనుగోలు చేయాల్సి వస్తుంది. వీటి బిల్లులు కూడా ప్రభుత్వం ఆలస్యంగా చెల్లించడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ మెనూ చార్జీలు కూడా గతంతో నిర్ణయించినవి కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

కష్టం మిగులుతుంది



ప్రభుత్వం అందిస్తున్న మెనూ చార్జీలు చాలడం లేదు. ప్రస్తుతం నిత్యా వసర వస్తువులు ధరలు బాగా పెరిగి పోయాయి. కష్టం మిగులు తుంది.

- చిలక జ్యోతి, వంట ఏజెన్సీ, పాలవలస

ప్రభుత్వం ఇచ్చేది ఏపాటికి?

ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనానికి ఒకటి నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5.88, ఆరవ తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ.8.57 చెల్లిస్తుంది. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పోవడంతో నష్టాలు తప్పడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు, కూరగాయల ధరలు తమకు పెనుభారంగా మారిందని మహిళలు తెలిపారు. మధ్యాహ్న భోజనంతో పాటు వారానికి మూడు రోజులు రాగిజావ అందించాలి. దీనికోసం గ్యాస్ కూడా అదే విధంగా ఖర్చు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

మెనూ ఇలా...

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకటి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం పెసరపప్పుతో పొంగలి లేదా గుడ్డు, చిక్కి, మంగళవారం పులిహోర, చెట్నీ, దొండకాయ, గుడ్డు, రాగి జావ, బుధవారం వెజ్ రైస్, ఆలు కుర్మా, గుడ్డు, చిక్కి, గురువారం సాంబార్ లేదా పులిహోర, టమోటా చట్నీ, రాగి జావ, శుక్రవారం అన్నం ఆకుకూర పప్పు, గుడ్డు, చిక్కి, శనివారం అన్నం ఆకుకూర పప్పు స్వీట్ పొంగల్, రాగి జావ అందిస్తారు.

నష్టాలు తప్పడం లేదు



పెరిగిన ధరలతో ప్రభుత్వం సూచించిన మెనూ విద్యార్థులకు అందించడంతో నష్టాలు చవి చూస్తున్నాం. ప్రభుత్వం స్పందించి వంట ఏజెన్సీలకు మెనూ ఛార్జీలను పెంచి సకాలంలో బిల్లులు చెల్లించాలి.

- అల్లాడ ప్రమీల, వంట ఏజెన్సీ, పాలవలస


కార్యాలయంలో గదిని క్లీనింగ్ చేస్తున్న ఆయాలు

ఆయాలతో క్లీనింగ్

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీ ఆయాలతో క్లీనింగ్ పనులు చేయిస్తున్నారు. ఫైల్స్, కార్యాలయం గదిని క్లీనింగ్ చేయడంతో పాటు పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న ఊయలకు పెయింటింగ్ వేయించారు. దీన్ని చూసిన ప్రతిఒక్కరు అధికారుల తీరుపై తప్పుపడుతున్నారు. కార్యాలయాన్ని శుభ్రం చేసేందుకు కార్యాలయానికి వచ్చిన నిధులతో కూలీలు పెట్టి పనులు చేయాల్సింది పోయి అంగన్వాడీ ఆయాలతో పెయింటింగ్ పనులు, కార్యాలయం శుభ్రం చేయించడంతో తోటి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రశ్నిస్తున్నారు. పనులు చేస్తున్న ఆయాలకు కూలీ కూడా ఇవ్వడం లేదు. ఈ విషయంపై ఐసిడిఎస్ పిఒ లావణ్యకు వివరణ కోరగా కార్యాలయంలో సమావేశాలు నిర్వహించేందుకు గది లేకపోవడంతో రికార్డులు, ఫైల్స్ ఉన్న ఒక్క గదిని ఆ మాత్రం శుభ్రం చేసేందుకు రెండో పూట ఆయాలను రమ్మని చెప్పడం జరిగిందని చెప్పారు. కేవలం కొద్ది సమయం కోసం పట్టణంలో ఉన్న ఆయాలను రమ్మని చెప్పామన్నారు.

రేపు జిల్లాస్థాయి చదరంగం పోటీలు

టెక్కలి: జిల్లాస్థాయి చదరంగం పోటీలు ఆదివారం జిల్లా కేంద్రంలోని నానుబోలు వారి వీధిలో నిర్వహించనున్నామని చదరంగం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు ప్రకటనలో తెలిపారు. ఈనెల 27, 28 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు జట్టు ఎంపిక చేయనున్నామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రూ.300 సభ్యత్వ నమోదు చెల్లించి జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. అండర్ 11 స్థాయిలో ఈ ఎంపిక చేపట్టనున్నామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు సంప్రదించాలన్నారు.

నేడు సాధారణ సర్వసభ్య సమావేశం

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10 గంటలకు ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించటం జరుగుతుందని ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని ఎంపిడిఒ వై.పద్మజ ప్రకటనతో తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంలో హాజరు కావాలని అమె సూచించారు.

శిరీషను కలిసిన జిఎస్‌టి అధికారులు

పలాస: టిడిపి కార్యాలయంలో శుక్రవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను పలాస జిఎస్‌టి అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గౌతు శిరీషకు సన్మానం చేశారు. జిఎస్‌టి అధికారి ఎ.శ్రీనివాసరావు, శ్వేత, టంకాల రవి శంకర్ గుప్తా, మల్లా శ్రీనివాసరావు, శాసనపురి మురళీ కృష్ణ, తంగుడు హరిశంకర్ పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

పాతపట్నం: మండలం తెంబూరు మేజర్ పంచాయతీలో శుక్రవారం సర్పంచ్ బెనియా వెంకట రమణ ఆధ్వర్యంలో వాతావరణంలోని మార్పులు కారణంగా గ్రామంలో అన్ని వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలందరూ అల్పపీడన వర్షాలతో జాగ్రత్తగా ఉండాలని, సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

చింతాడ సంత వేలంపాట ఖరారు

ఆమదాలవలస: పురపాలక సంఘంలో ఏడవ వార్డు పరిధిలో ఉన్న చింతాడ సంత వేలంపాటను పురపాలక సంఘ అధికారులు ఖరారు చేశారు. శుక్రవారం పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ జి.రవి ఆధ్వర్యంలో సంత ఆశీల్ల వసూళ్లకు బహిరంగ వేలం పాట నిర్వహి ంచారు. ఈ వేలం పాటలో చింతాడకు చెందిన బోర హరనాథ్, గుండ వెంకటరమణ పాల్గొన్నారు. రూ.7,07,500తో పాటను ప్రారంభించగా బోర హరనాథ్ రూ.7,19,500 పాటను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేలంపాట సమాచారాన్ని పురపాలక సంఘ ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు. అలాగే వేలం పాటను దక్కించుకున్న గుత్తేదారు ఆగస్టు 1నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు సంత ఆశీలు వసూలు చేసుకునే హక్కును కలిగి ఉంటారని తెలిపారు. మేనేజర్ బిషాయ్, రెవిన్యూఇన్‌స్పెక్టర్ రామారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సంత వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

నీరు ఇవ్వక రైతులు నష్టపోయారు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వంశధార శివారు రైతులకు నీరు ఇవ్వక తీవ్రంగా నష్టపోయారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. వంశధార 60 ఆర్ఎల్ కాలువ ద్వారా పెద్దబొడ్డపాడు, రామసాగరంలోకి సాగునీరు చేరిన సందర్భంగా మండల టిడిపి నాయకుడు దుంపల వల్లభరావు ఆధ్వర్యంలో శుక్రవారం జలహారతి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి పాలకులకు రైతు సమస్యలపై చిత్తశుద్ధి లేదన్నారు. రైతులపై మొసలికన్నీరు కార్చడం తప్ప, ఏ రోజు సాగునీరు అందించడానికి ముందుకు రాలేదన్నారు. మాజీమంత్రి అప్పలరాజు తన చేతకానితనంతో సాగునీరు అందించకుండా ఎగువ ప్రాంతంలో అనధికార లిఫ్టులు ఏర్పాటు చేసారని, అర్థం లేని వింత వాదన అందుకొని ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేసారని ఆరోపించారు. అప్పలరాజు మంత్రి హోదాలో ఉండి రైతులకు సాగునీరు అందించడానికి కనీస ప్రయత్నం చేయలేదని, టిడిపి అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోనే వంశధార శివారు భూములకు సాగునీరు అందించామని గుర్తు చేసారు. అదే విధంగా కొత్తపేట పంచాయతీ దిబ్బవానిపేటలో జలజీవన్ మిషన్ ప్రాజెక్టు పనులకు మాజీ సర్పంచ్ గోవింద పాపారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శిరీష శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షుడు సూరాడ మోహనరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి కణితి సురేష్, ఎ.ఉమామహేశ్వరరావు, తమ్మినాన బాలకృష్ణ, ఉప్పాడ కృష్ణారావు, గోపాలరావు, తాతయ్య, రమేష్ పాల్గొన్నారు.


జల హారతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీష

మంత్రికి వినతుల వెలువ


మోహనరావు సమస్య వింటున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- సోంపేట

ఇచ్చాపురం నియోజకవర్గం పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు మండలంలోని కొర్లాం జాతీయ రహదారి వద్ద శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే అశోక్‌తో పాటు కూటమి నాయకులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సోంపేటకు చెందిన కె.మోహనరావు కండక్టర్ ఉద్యోగంలో రెండు కాళ్లు పోయి ఉద్యోగం లేక చాలా ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే మంత్రికి తెలియజేయగా నేరుగా మంత్రి బాధితుడితో మాట్లాడారు. ఆపరేషన్‌కు రూ.40 లక్షల వరకు ఖర్చయిందని, ప్రస్తుతం ఉద్యోగం లేక చాలా ఇబ్బంది పడుతున్నానని, ఉద్యోగం ఇప్పించాలని మోహనరావు కోరాడు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, సొండి కుల సంక్షేమ సంఘం రాష్ట్ర కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందించారు. అలాగే కొర్లం సర్పంచ్ ప్రతినిధి రామ్ బుడ్డి గణపతి పంచాయతీ సమస్యలపై, బారువ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని, బారువ రైల్వేస్టేషన్ అభివృద్ధి చేయడమే కాకుండా పలు ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదలకు చర్యలు చేపట్టాలని కోరారు. నాయకులు చిత్రాడ శ్రీను, చిత్రాడ శేఖర్, మద్దిల నాగేశ్వరరావు, వెదుళ్ల హరికృష్ణ, జగన్నాథరావు, బడే సూర్యనారాయణ, మడ్డు కుమార్, ఉత్తరాల బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో గొప్పిలి, గోకర్ణపురంలో డ్రై డే కార్యక్రమం ఎంఇఒ, పంచాయతీ నోడల్ అధికారి మల్లారెడ్డి పద్మనాభరావు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసరాల్లో పూల కుండీల్లో నీటి నిల్వ ఉంచరాదన్నారు. గ్రామాల్లోని వీధుల్లో, డ్రైనేజీల్లో పూడికలు తీసి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాలల్లో వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు సుదర్శనరావు, ఎర్రయ్య, వైద్య సిబ్బంది తేజమ్మ, సంధ్య, జయలక్ష్మి, భానుమతి, ఉషారాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస: కురుస్తున్న వర్షాల వలన నివాస ప్రదేశాల్లో ఉండే నీటి నిల్వలపై అప్రమత్తంగా ఉండాలని వెలుగు ఎపిఎం పైడి కూర్మారావు ప్రజలకు సూచించారు. కొర్లకోట పంచాయతీలో కార్యదర్శి సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో శానిటేషన్ స్పెషల్ ఆఫీసర్‌గా పాల్గొన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ రమణ, స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కొత్తూరు : ర్యాలీ చేపడుతున్న మహిళా సంఘ సభ్యులు

కొత్తూరు: పారిశుద్ధ్య పక్షోత్సవాల్లో భాగంగా వెలుగు ఆధ్వర్యంలో మహిళా సంఘ సభ్యులు చాకలివీధి, గాజుల వీధి, పెద్దవీధి, మార్కెట్ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు సిసి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కందిపప్పులో నాణ్యత లోపిస్తే చర్యలు


కోటబొమ్మాళి : కందిపప్పు నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

దుకాణాల్లో విక్రయిస్తున్న కందిపప్పు నాణ్యత లోపించినా, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి విక్రయాలు జరిపినా చర్యలు తీవ్రంగా ఉంటాయని సివిల్ సప్లై డిఎం కార్యాలయం అధికారులు పి.నాగేశ్వరరావు. పి.గాయత్రి అన్నారు. శుక్రవారం స్థానిక కొత్తపేట, కోటబొమ్మాళిలో పలు కిరాణా షాపులు, సూపర్ మార్కెట్‌ల్లో కందిపప్పు నాణ్యత పరిశీలించారు. ప్రతి దుకాణంలోనూ ధరలు పట్టిక కచ్చితంగా ఏర్పాటు చేయాలని, కందిపప్పు ప్రభుత్వం రూ.151 నుంచి రూ.160కే విక్రయాలు జరపాలని నిర్ణయించిందన్నారు. స్థానిక సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ కె.రాము. విఆర్ఒలు పి.అఖిల్ పాల్గొన్నారు.

నందిగాం: మండల కేంద్రంలో గల దుకాణ సముదాయాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కందిపప్పు, బిపిటి స్వానామసూరి, మసూరి రకాల బియ్యం రూ.48, కందిపప్పు రూ.160 అమ్మించేందుకు బజార్ ఆవరణలో గల చిన్నారావు కిరాణా, అప్పలసూరి కిరాణా షాపులను డిప్యూటీ తహశీల్దార్ ఎం.భాగ్యలక్ష్మి సివిల్ సప్లై టెక్నీషియన్ నవ్య షాపులను పరిశీలించి ఎంపిక చేశారు.

అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపం

పొందూరు: ఆంధ్రా-ఒడిశా అంతరాష్ట్ర రహదారి అది. రహదారి పక్కన ఆనుకుని ఇష్టాను సారంగా నిర్మాణాలు చేపట్టి రహదారి కిందన గల కాలువలను మూసివేశారు. దీనిని ప్రశ్నించి చర్యలు చేపట్టాల్సిన ఆర్అండ్‌బి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి పట్టించుకోకపోవడంతో చిన్నపాటి వర్షాలకు పంట పొలాల్లో నీరు నిలబడి పంటలు ముంపునకు గురవుతున్నాయంటూ రైతన్నలు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోని పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలోని రాపాక కూడలి నుంచి పొందూరు పట్టణం వరకు గల రహదారిలో నిర్మాణాలు చేపట్టి కాలువలను పూడ్చివేయడంతో రైతన్నలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. వర్షాలు కురిసినప్పుడు పంట పొలాల్లో వరదనీరు బయటకు పోయేలా ఈ రహదారిలో సుమారు 10 అడుగుల కాలువలు ఉండగా వాటిని ఆక్రమించి రహదారి వెంబడి నిర్మాణాలు జరిపారు. దీనిని అడ్డుకోవాల్సిన ఆర్అండ్‌బి, రెవిన్యూ అధికారులు లంచాలకు తలొగ్గి చూసీ చూడనట్లు వ్యవహరించడంతో నిర్మాణదారులు యథేచ్ఛగా కాలువలను పూడ్చివేశారు. ఫలితంగా కురిసిన వర్షాలకు వరదనీరు పంట పొలాల్లో నిలిచిపోవడంతో పాటు రహదారి పైకి చేరుతుంది. దీంతో రహదారిలో రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటపొలాల నుంచి నీరుపోయే మార్గం లేకపోవడంతో పంటలను సాగు చేసేందుకు కూడా ఆసక్తి లేకుండా పోయిందంటూ పలువురు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిలో ఉన్న కాలువలను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలంటూ రైతులు, ప్రయాణికులు కోరుతున్నారు.


రోడ్డుపైన, పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి అవయవదానం

ప్రజాశక్తి- నౌపడ


శ్రీనివాసరావు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించినా అవయవాలు మాత్రం సజీవంగానే ఉన్నారు. సంతబొమ్మాళి మండలం గోవిందపురం పంచాయతీ జొన్నల పాడుకు చెందిన చల్లా శ్రీనివాసరావు (26) నరసన్నపేటలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో పని చేస్తున్నాడు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం పెద్దపాడు సమీపంలోని కేంద్రీయ విద్యాలయం వద్ద విశాఖపట్నం నుంచి కారులో వస్తుండగా లారీ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే చికిత్స కోసం జెమ్స్ ఆస్పత్రికి తరలించగా వారం రోజులుగా కోమాలో ఉన్న శ్రీనివాసరావుకు బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో ఆయన అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కిడ్నీ, లివర్, గుండెతో పాటు ఇతర అవయవాలను జెమ్స్ ఆస్పత్రిలో అప్పగించారు. తల్లిదండ్రులు చల్లా మల్లేసు, అప్పమ్మలకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు సూర్యనారాయణ, రెండవ కుమారుడు శ్రీనివాస్ అవివాహితుడు శ్రీనివాసరావు మృతదేహానికి శుక్రవారం గ్రామంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. గ్రామంలో ఎవరికైనా వైద్యపరంగా ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వారికి వైద్య సేవలు అందించడంలో ముందుండే శ్రీనివాసరావు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

పంచాయతీ కార్యదర్శిగా దిలీప్

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం మేజర్ పంచాయతీ సెక్రటరీగా డి.దిలీప్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కంప్యూటర్ అసిస్టెంట్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తుండగా శుక్రవారం నుంచి దిలీప్ కుమార్‌కు పూర్తి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఎంపిడిఒ రామకృష్ణ రాజు తెలిపారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ప్రశాంత వాతావరణానికి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌సి, ఎస్‌టి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఎస్‌పి మహేశ్వర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు గంజి ఎజ్రా మాట్లాడుతూ జిల్లా ఎంతో ప్రశాంతమైనదని, ఈ జిల్లాలో విధులు నిర్వహించిన ఎస్పిలు ఉన్నత స్థానంలో ఉన్నారన్నారు. ఎస్‌పి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తనకు పత్రికలు చదవడం ఎంతో అభిలాషని, జర్నలిస్టులు అందించే వార్తలే సమాజంలో చైతన్యం తీసుకొస్తుందన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పిన్నింటి అప్పన్న, గొల్లపల్లి నందేశ్, కె.నారాయణ మూర్తి, సిహెచ్ గణపతి, బలగమోహన్, ఆకుల కృష్ణ, బమ్మిడి వేణుగోపాల్, జి మణికుమార్, చంద్రమోహన్, బాలకృష్ణ, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


దీక్షల్లో పాల్గొన్న బెంతు ఒరియా ప్రతినిధులు

కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి- కవిటి

కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు వర్షంలోనూ కొనసాగు తున్నాయి. అందులో భాగంగా 206వ రోజు శుక్రవారం దీక్షలో యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు గుర్తింపు లభించే వరకూ, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

జనసేన సభ్యత్వాల నమోదు

ప్రజాశక్తి- టెక్కలి

స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 10 రోజులు సభ్యత్వ నమోదు జరుగు తుందన్నారు. ఈ సందర్భంగా పార్టీ రూపొందించిన విధానాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుడ్డ గవరయ్య, కుమార స్వామి, అవినాష్, చిరంజీవి, భాస్కర్, గురయ్య, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై రైతుబజారులో టమోటాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సబ్సిడీపై రైతు బజార్ ద్వారా కిలో టమాటా రూ.65కే విక్రయిస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ కార్యదర్శి డి.జయ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రైతు బజార్‌లో టమాటా విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.100 ధర పలుకుతుండడంతో ప్రభుత్వం రైతు బజార్ ద్వారా సబ్సిడీపై తక్కువ ధరకు టమాటాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ సూపర్ వైజర్ కె.చిన్నప్పమ్మ, సెక్యూరిటీ గార్డులు జి.శ్యామలరావు, మురళీధర్, వాచ్‌మెన్ అంబటి శైలజ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వసతి సమస్య తీర్చాలి

వజ్రపుకొత్తూరు: అక్కుపల్లిలోని ఎపి బిసి బాలుర గురుకుల పాఠశాలకు వసతి సమస్యకు పరిష్కారం చూడాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను కోరారు. శుక్రవారం పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.పాపారావు ఆధ్వర్యంలో ప్రస్తుత ప్రిన్సిపాల్ జి. ప్రశాంతి ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందించారు. ప్రస్తుతం ఎస్‌సి హాస్టల్‌లో తరగతులు నిర్వహి స్తున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆ భవనాలు కూడా శిథిలావస్థలో ఉన్నాయని, దీంతో తరగతులను భయం భయంగా నిర్వహించాల్సి వస్తుందని పేర్కొన్నారు. బెండికొండ వద్ద నూతన భవనాల నిర్మాణం కోసం స్థలసేకరణ జరిగినా కార్యరూపం దాల్చకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అంతవరకు తాత్కాలిక అద్దె భవనంలోకి అనుమతికావాలని ఎమ్మెల్యేను కోరారు.

వర్షపునీటితో విద్యార్థులకు అవస్థలు

పొందూరు: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షానికి తరగతి గదిలో నీరు చేరిపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని తాడివలస పంచాయతీ లచ్చయ్యపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు. పాఠశాలపై శ్లాబ్ నుంచి వర్షంనీరు కారడంతో తరగతి గది నిండా నీరు చేరింది. దీంతో విద్యార్థులు కూర్చొలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. విద్యార్థులు, ఉపాధ్యాయుడు కలిసి ఆ నీటిని బయటకు తోడేందుకు నానా అవస్థలు పడ్డారు. పాఠశాల పరిస్థితి ఇలా ఉంటే తమ పిల్లలు చదువుకునేదెలా అని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రికి ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి

పాతపట్నం: కోటబొమ్మాళి మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రి అచ్చెన్నాయుడుకు జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ సమస్యలు పరిష్కరించాలని ఫీల్డు అసిస్టెంట్లు కోరారు. స్పందించిన ఆయన సమ స్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా, రాష్ట్ర నాయకులు, పాతపట్నం మండల పెద్ద లక్ష్మీపురం ఫీల్డ్ అసిస్టెంట్ భైరాగి నాయుడు, గున్న ధర్మారావు, శ్యామ్, కళ్యాణ్, నీలకంఠం, శ్రీరాములు, జగదీష్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

పాతపట్నం: స్థానిక మహేంద్ర జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్య అతిథిగా పాతపట్నం జూనియర్ సివిల్ ఇన్‌ఛార్జి జడ్జి తేజ చక్రవర్తి పాల్గొని మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపకూడదని, హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని, సెల్‌ఫోన్‌తో డ్రైవింగ్ వలన నష్టాలను వివరించారు. కళాశాల కరెస్పాండెంట్ శాసనపురి మధుబాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని, వాటిని ఆచరించాలన్నారు. న్యాయ సేవా విభాగ ఇన్‌ఛార్జి మద్దిల రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గేదెల సూర్యం, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి. సత్య న్నారాయణ, ప్రకాశరావు, దాలయ్య, రామకృష్ణ, ప్రిన్సిపాల్ మెట్ట ఆంజనేయులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో మొక్కలు నాటాలి

పలాస: వర్షాకాలంలో విరివిగా మొక్కలు నాటాలని గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ అన్నారు. పలాస రైల్వే ఆవరణకు సమీపంలో ఉన్న ఎంపిపి అంబుసోలి పాఠశాల వద్ద గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఋతువులు క్రమం తప్పకుండా ఉండాలంటే మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. జామ, ఉసిరి, చెర్రీ, బాదం, కదంబ వివిధ పండ్ల రకాల మొక్కలు నాటారు. హెచ్ఎం జె.సంతోష్ కుమార్, ప్రకృతిప్రేమికులు కొత్తపల్లి చిన్నా ఆచారి, ఉపాధ్యాయులు సిహెచ్ సావిత్రి, టి.చినబాబు, గ్రీన్ సభ్యులు జనార్ధన, దిలీప్, కార్యదర్శి తిరుమల పాల్గొన్నారు.

చంద్రన్న బీమా అందజేత

కవిటి: మండలం ముత్యాలపేటలో పాతిన లక్ష్మికి చంద్రన్న బీమా రూ.10వేలు శుక్రవారం అందజేశారు. లక్ష్మి భర్త హరిహరరావు కిడ్నీ వ్యాధితో ఇటీవల మరణించాడు. దీంతో స్థానిక నాయకులు హరి హారారావు భార్యకు తక్షణ సాయంగా బీమా డబ్బులు రూ.10వేలు అంది ంచారు. మిగతా మొత్తం రూ.90 వేలు ఆమె వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్ సతీష్, నారాయణరావు, కృష్ణారావు, హరి హరరావు, పాల్గొన్నారు.

జల దిగ్బంధంలో మున్సిపల్ రహదారులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ రహదారులు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పురపాలక సంఘంలోని 13వ వార్డు సాయి నగర్, 14వ వార్డు ఐజెనాయుడు కాలనీ, 15వ వార్డు పాతినవారి వీధి, 17వ వార్డు పూజారిపేటలో వర్షపు నీరు రోడ్లపై నిలువ ఉండడమే కాకుండా మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంది. శిథిలమైన మురికి కాలువల ద్వారా ప్రవహిస్తున్న నీరు చిన్నపాటి వర్షం పడితే రహదారిపై ప్రవహించి వీధుల్లో మురికినీరు చేరి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పట్టణవాసులు వాపోతున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో మురికి కాలువల్లో నీరు రహదారులపై ప్రవహించడంతో పట్టణ వాసులతో పాటు పలువురు విద్యార్థులు మురికి నీటిలో నడుచుకుంటూ రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఇప్పటికే వాతావరణ మార్పుతో పలువురు జ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్న సమయంలో డ్రైనేజీల ద్వారా వెళ్లాల్సిన మురుగునీరు రహదారులపై చేరడంతో జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలుతాయన్న భయం పట్టణ వాసులను వెంటాతుడుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుపై నిల్వ ఉన్న నీటిని తొలగించి వ్యాధుల బారిన పడకుండా ప్రజలను రక్షించాలని పలువురు కోరుతున్నారు.



సాయినగర్‌లో రోడ్డుపై నిలిచిన నీరు

వేధింపుల చట్టంపై అవగాహన అవసరం

టెక్కలి : పనిచేసే చోట మహిళలపై జరుగుతున్న వేధింపులను అరికట్టాలంటే చట్టాలపై అవగాహన అవసరమని ఐసిడిఎస్ పిఒ శోభారాణి అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో వేధింపుల చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేధింపులకు గురైన భాదిత మహిళలు ఎవరికి ఫిర్యాదు చేయాలనే అంశంపై ఏర్పాటు చేసిన కమిటీల్లో భాగస్వామ్యం అవసరమన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేయనున్నామన్నారు. వీరికి సంప్రదించి మహిళలపై వేధింపులను అడ్డుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జ: ఫోక్సో చట్టంపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మోడల్ అధికారి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో ఫోక్సో యాక్ట్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడుతూ మహిళలు పనిచేసే చోట వారిపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే ఫోక్సో చట్టం కింద ఎటువంటి శిక్షలు పడతాయో వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అంబేద్కర్, ఐసిడిఎస్ పిఒ గీత, ఎపిఎం బాబురావు, శశిధర్, సచివాలయ సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీకృత నియామకాలు రద్దు చేయాలి



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

టెక్కలి: గిరిజన విద్యార్థుల ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయుల భర్తీకి ప్రస్తుతం ఉన్న కేంద్రీకృత నియామకాల ప్రక్రియను తక్షణమే కేంద్రం వెనక్కుతీసుకోవాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య ప్రజా సంఘం (పిడిఎస్‌యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ మేరకు శుక్రవారం టెక్కలిలో ఆయన మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో 38 వేల మంది సిబ్బందిని నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (నెస్టే) ద్వారా భర్తీ చేస్తామని కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో చేసిన వ్యాఖ్యలు సందేహాలకు తావిస్తుందన్నారు. గిరిజన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో, విద్యార్థులు మాట్లాడే భాషలో బోధన జరగాలన్నారు. కేంద్రం చేపట్టే నియామకాలు రద్దు చేయాలని వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈయనతో పాటు జిల్లా నాయకులు ఆర్.మహేష్, రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్‌పై ఎమ్మెల్యే ఆరా

ప్రజాశక్తి- పలాస

రూ. 700 కోట్లు వ్యయంతో నిర్మాణం చేపట్టిన జల జీవన్ మిషన్ ప్రాజెక్టు పనులు ఎంత వరకు వచ్చాయి...? ఇప్పటి వరకు ఎంత శాతం పనులు చేపట్టారు....? ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా తదితర అంశాలపై ఎమ్మెల్యే గౌతు శిరీష ఆరా తీశారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం జలజీవన్ మిషన్ ప్రాజెక్టు అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందా...? లేదా....? ఎన్ని గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు....? అసలు గ్రామాల్లో పూర్తిస్థాయిలో పైపులైన్ నిర్మాణం చేపట్టారా...? ఇప్పటివరకు ఎంత నిధులు వెచ్చించారు....? తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసు కున్నారు. ప్రతి గ్రామానికి తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జలజీవన్ మిషన్ ప్రాజెక్టు డిఇ ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'లంపి స్కిన్'కు ఉచిత టీకాలు

మందస: లంపి స్కిన్ వ్యాధి పశువులు మధ్య వేగంగా వ్యాప్తి చెందే లక్షణం కలిగి ఉండి రైతులకు ఆర్థికంగా నష్టం కలిగించే అతి ముఖ్యమైన వైరల్ వ్యాధి అని మందస, హరిపురం పశువైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమభారతి అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాధి ప్రధానంగా ఆవు జాతి పశువుల్లో కనిపిస్తుందని, అన్ని వయసు పశువులకు ఈ వ్యాధి సోకుతుందన్నారు. ఈ వ్యాధి ముఖ్యంగా వేడి, తేమతో కూడిన వాతావరణం ఉన్న నెలలో, పశువులను ఆశించే కీటకాల ద్వారా ఎక్కువగా వ్యాప్తి చెందుతుందన్నారు. వ్యాధి సోకిన పశువులకు తీవ్ర జ్వరం, కళ్లు, ముక్కు నుంచి శ్రవాలు కారుతుంటాయని, కొన్ని పశువుల్లో నోటి నుంచి చొంగ కారుతుందన్నారు. ఈ వ్యాధి తీవ్రంగా ఉన్న పశువుల్లో శరీరం అంతటా నొప్పితో కూడిన కణతలు, బొడిపెలు ఏర్పడతాయి. ఈ వ్యాధి సోకిన పాడిపశువుల్లో పాల దిగుబడి గణనీయంగా తగ్గడంతో పాటు కొన్నిసార్లు మరణాలు కూడా సంభవిస్తాయన్నారు. వ్యాధి నివారణకు మండలంలో 12,400 డోసుల లంపి స్కిన్ వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నాయని, ఈ నెల 20 నుంచి ఆగష్టు 18 వరకు రైతు సేవా కేంద్రాల సిబ్బంది ద్వారా ఈ వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా వేయబోతున్నామని తెలియజేశారు. పాడి రైతులు ఈ వ్యాదిపై అప్రమత్తంగా ఉండి, వ్యాధి రాకుండా నివారణకు ముందస్తు టీకాలను తమ పశువులకు వేయించుకోవాలని సూచించారు.



సీతానగరం మొసలిగెడ్డపై గాలం వేస్తున్న యువకులు

వేసేద్దాం గాలం... తీసేద్దాం మీనం

ప్రజాశక్తి - నౌపడ

అసలే వర్షాకాలం... ఆపై ప్రవహించే గెడ్డలు, చెరువులు, వాగుల్లో చేపలు విస్తృతంగా దొరుకుతుంటాయి. ప్రవాహానికి ఎగురుతున్న చేపలను పట్టాలన్న ఆసక్తి ఎవరికి ఉండదు చెప్పండి. పనుల్లేని ఈ కాస్త ఖాళీ సమయంలో స్నేహితులతో కలిసి గాలం వేయడం, చేప చిక్కితే సంచిలో వేయడం ఆ ఆనందమే వేరు. ఆనందమే కాదు ఆ పూట ఇంటికి చేపల కూర కూడా అవుతుంది. ఈవిధంగా పలువురు యువకులు, పెద్దలు ఒకచోట చేరి గెడ్డలో గాలం వేసి చేపలు పడుతున్న దృశ్యం సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీ సీతానగరంలో శుక్రవారం కనిపించింది. గ్రామంలోని నౌపడ -వెంకటాపురం రహదారిలో మొసలి గెడ్డపై సుమారు 30 మంది యువకులు వరుసగా గాలములతో చేపలు పడుతున్న దృశ్యం ఆకట్టుకుంది.

చోరీల నివారణకు చర్యలు

ప్రజాశక్తి- బూర్జ



మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాద్

మండలంలో ఎటువంటి చోరీలు జరగకుండా కఠిన చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ జి.వి.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ప్రజాశక్తితో మాట్లాడారు. అవసరమైన చోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, రాత్రుల సమయాల్లో పహారా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా అవసరమైన చోట సిసి కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదని, ముఖ్యంగా వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ప్రతిఒక్కరు ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు.

వంశధార కాలువ ఆధునికీకరణకు కృషి

నౌపడ: రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లి కుర్మానాథపురం వంశధార కాలువ ఆధునికీకరణ పనులు చేపడుతామని టిడిపి నాయకులు సుగ్గు శాంతి స్వరూప్ రెడ్డి అన్నారు. కుర్మానాథపురం వద్ద శ్రీరామ్ కాలువను శుక్రవారం పరిశీలించారు. త్వరలో పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బాబ్జి, మహంతి రాజు, దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా బస్తాలు అందజేత

నౌపడ: నౌపడ 1, 2 గ్రామ సచివాలయ పరిధిలో రైతులందరూ యూరియా, డిఎపి బస్తాలను వినియోగించుకోవాలని టిడిపి నాయకులు సుగ్గు శాంతి స్వరూప్ రెడ్డి కోరారు. నౌపడ గ్రామ సచివాలయం-2లో రైతులకు యూరియా, డిఎపి బస్తాలను శుక్రవారం పంపిణీ చేశారు. టిడిపి సీనియర్ నాయకులు వాడరేవు కృష్ణారావు, చెన్నూరు గౌరీ శంకర్ బాబ్జి, కర్రి బాలకృష్ణ, కార్యదర్శి ఉమాపతి, సచివాలయ సిబ్బంది మృదుల, ఉదయ్ పాల్గొన్నారు.



యూరియా బస్తాను అందజేస్తున్న స్వరూప్ రెడ్డి